సాక్షి కృష్ణాజిల్లా

శుక్రవారం । 14 । మార్చి । 2025



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి విజయవాడ కస్తూరిబాయి పేటకు చెందిన మోటూరు శివమోహన్‌రావు, కమలా రాణి రూ. 1,01,116 విరాళాన్ని అందజేశారు.



తిరుపతమ్మ సేవలో..

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మవారిని గురువారం ట్రైనీ ఎస్పీ మనీషారెడ్డి దర్శించుకుని, పూజలు నిర్వహించారు. డీసీపీ మహేశ్వరరాజు, నందిగామ ఏసీపీ తిలక్ తదితరులున్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్ర)	సహరి (శని)
మచిలీపట్నం	6.21	4.56
విజయవాడ	6.22	4.58

న్యూస్‌రీల్

వీఆర్వోల సమస్యలు పరిష్కరించాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వీఆర్వోలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వీఆర్వోల సంఘం ప్రతినిధులు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశకు విన్నవించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశను కలిసి వినతి పత్రం అందజేశారు. సచివాలయల రేషనలైజేషన్ ప్రక్రియలో భాగంగా వీఆర్వోలకు జరుగుతున్న నష్టాన్ని కలెక్టర్‌కు వివరించారు. పనిభారం తగ్గించాలని, ఇతర శాఖల పనులు కేటాయించడంతో రీ సర్వే పనులు నిలిచిపోతున్నాయని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వీఆర్వోల సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు రాచకొండ శ్రీనివాసరావు, నందిగామ డివిజన్ అధ్యక్షుడు కె. లీలా ప్రసాద్, విజయవాడ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ బాజీ, ప్రచార కార్యదర్శి హుస్సేన్ తదితరులు ఉన్నారు.

షాపుల నిర్వహణకు బహిరంగ వేలం



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో వివిధ షాపుల నిర్వహణకు టెండరుదారులను గురువారం ప్రకటించారు. దేవస్థానం ప్రాంగణంలో దేవదాయశాఖ అధికారి శ్రీనివాసరావు సమక్షంలో ఏప్రిల్ 1, 2025 నుంచి మార్చి 31, 2026 ఏడాది కాలానికి గాను సీల్డ్ టెండర్లు ఓపెన్ చేసినట్లు ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. భక్తులకు చెవి కుట్టి, చెవి పోగులు విక్రయించుకొను లైసెన్స్ హక్కును మోపిదేవికి చెందిన లకోజి బ్రహ్మానందం రూ. 7,91,000కు దక్కించుకున్నారన్నారు. సీసీ కెమెరాలు రిపేరు, సర్వీసు చేసేందుకు మచిలీపట్నంకు చెందిన టి. కేదార్‌నాథ్ రూ. 1,62,000కు, పెరుగు అన్నం సప్లయి చేసేందుకు మోపిదేవికి చెందిన వీఎల్‌కే గుప్త లీటరు పాలకు రూ. 74, స్వామివారి నిత్యాన్నదానానికి అరటి ఆకులు సరఫరా చేసే లైసెన్సు హక్కును మోపిదేవికి చెందిన కె. రాఘవేంద్రరావు 100 ఆకులకు రూ. 109కు దక్కించుకున్నట్లు తెలిపారు. మిగిలిన పాటలకు ఔత్సాహికులు ముందుకు రానందున వాయిదా వేశామని వివరించారు. ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక



విజయవాడస్పోర్ట్స్: జాతీయ అంతర విశ్వవిద్యాలయాల బాల్ బ్యాడ్మింటన్ పురుషుల పోటీలకు ప్రాతినిధ్యం వహించే డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ జట్టును ఎంపిక చేసినట్లు వర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ ఇ.త్రిమూర్తి తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల్లో అత్యుత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన కె.జస్వంత్‌కుమార్ రాజు, కె.వి.జె.జస్వంత్‌కుమార్, ఎం.ఉదయభాస్కర్, ఎం.ఓబులేసు, ఎస్.శంకర్‌నాయక్, పి.బాలాజిరెడ్డి, పి.రవికిరణ్, టి.రవికిషోర్, ఎం.కౌశిక్ శశాంక్ చౌదరి, పి.శ్రీవివేక్‌కుమార్ జట్టులో చోటు దక్కించుకున్నట్లు వివరించారు. ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు బెంగళూరులో జరిగే జాతీయ అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు. ఈ జట్టుకు మేనేజర్‌గా సెయింట్ జోసఫ్ డెంటల్ కాలేజీ(ఏలూరు) పీడీ ఎస్.నల్లయ్య వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. జట్టు బృందాన్ని వర్సిటీ రిజిస్ట్రార్ వి.రాధికరెడ్డి వర్సిటీ ప్రాంగణంలో బుధవారం అభినందించారు.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటాం

ఆటోనగర్ (విజయవాడ తూర్పు): ఎస్సీ వర్గీకరణను అడ్డుకొని తీరుతామని, మాలలకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని అఖిలభారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ ఉప్పులేటి దేవిప్రసాద్ అన్నారు. గురువారం విజయవాడ గురునానక్ కాలనీ జేఏసీ ప్రధాన కార్యాలయంలో ఈ నెల 23న చేపట్టనున్న 'హలో మాల.. చలో తిరుపతి' కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మాలలకు న్యాయం జరిగేంత వరకు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్రాన్ని నిలదీస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రిక్రూట్‌మెంట్‌లు ఆపి చోద్యం చూస్తోందని, బ్యాక్‌లాగ్ పోస్టుల ఖాళీలను భర్తీ చేయకుండా ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేస్తోందని మండిపడ్డారు.

ఇసుకాసురుల చేతుల్లో కృష్ణమ్మ బందీ!



నది మధ్యలో డ్రెడ్జింగ్ చేసి పడవల్లో ఇసుక లోడ్ చేస్తున్న దృశ్యం

డ్రెడ్జింగ్ యంత్రాలతో నదీ గర్భానికి తూట్లు

- ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు
- అమలు కాని వాల్టా చట్టం
- ఇసుక రవాణాకు అనువుగా అక్కడే పడవల తయారీ
- రోజుకు 500 ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా
- రూ. లక్షలు దోచుకుంటున్న కూటమి నేతలు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: కృష్ణమ్మకు కన్నీటి శోకమే మిగులుతోంది. ఇసుకాసురులు నదీగర్భంలో తూట్లు పొడిచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. విజయవాడకు కూత వేటు దూరంలో ఈ దందా జరుగుతున్నా ప్రభుత్వ పెద్దలు తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరిస్తూ.. అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారు.

కృష్ణమ్మకు గర్భశోకం..

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద కృష్ణా నదిలో అనుమతులు లేకుండా కూటమి నాయకులు భారీ యంత్రాలతో ఇసుక తవ్వి తరలిస్తున్నారు. నదీ గర్భంలో ఇసుక తవ్వకాలు జరపకూడదనే ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, అధికారుల హెచ్చరికలను పెడచెవిన పెట్టి యథేచ్ఛగా ఇసుక తవ్వుతున్నారు. వాల్టా చట్టానికి తూట్లు పొడిచి నదీగర్భంలో డ్రెడ్జింగ్ యంత్రాలు వినియోగిస్తున్నారు. దోపిడీని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మైనింగ్, రెవెన్యూ అధికారులపై దౌర్జన్యానికి దిగుతున్నారు. దీంతో అధికారులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

కృష్ణానదిలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. వాల్టా చట్టం ప్రకారం కృష్ణా నదిలో పడవల ద్వారా ఇసుక తవ్వాలంటే పీడబ్ల్యూడీ, జలవనరుల శాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉంది. అనుమతులు ఉన్నా కూడా నీటి మట్టానికి 3.5మీటర్ల లోతులోనే మాన్యువల్‌గా ఇసుక తవ్వకాలు జరపాల్సి ఉంది. అయితే ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా భారీ డ్రెడ్జింగ్ యంత్రాలు కలిగిన పడవలతో నదిలో రిగ్‌బోరు ద్వారా యథేచ్ఛగా ఇసుక తోడేస్తున్నారు. దీంతో నది గర్భంలో పెద్దసైజు గుంతలు ఏర్పడి ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. ఇటువంటి గుంతలతోనే 2017లో ఫెర్రీ వద్దకు వచ్చిన పర్యాటకుల పడవ బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో 22 మంది పర్యాటకులు మృత్యువాత పడ్డారు.

కూటమి నాయకుల కనుసన్నల్లోనే..

ఇబ్రహీంపట్నం ఫెర్రీ, గుంటుపల్లి గ్రామాల్లో కృష్ణా నది నుంచి ఇసుక తవ్వకాలు కూటమి నాయకుల కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. నెలరోజుల క్రితం నదిలో ఇద్దరు కూటమి నాయకులు రెండు పడవలతో ఇసుక తవ్వకాలు మొదలు పెట్టగా వారికి పోటీగా ఇప్పుడు సుమారు 25పడవల యజమానులు ఇసుక తవ్వకాలు ప్రారంభించారు. పెద్ద సైజు పడవలో సుమారు 30నుంచి 40ట్రాక్టర్ల ఇసుక తీసుకొస్తున్నారు. చిన్న పడవల్లో 10ట్రాక్టర్ల ఇసుక చేరవేస్తున్నారు. నది ఒడ్డుకు చేరిన పడవల్లోని ఇసుకను 18 మాన్యువల్ క్రేన్‌ల ద్వారా ట్రాక్టర్లకు లోడింగ్ చేస్తున్నారు. పడవలు పొడైపోయిన యజమానులు వారి వద్ద ఉన్న క్రేన్, ఆ స్థలం నెలకు రూ.3లక్షల చొప్పున అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు.

ఇక్కడే పడవల తయారీ..



ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద తయారు చేస్తున్న భారీ సైజు పడవలు

నదిలో ఇసుక తవ్వకాలకు అవసరమైన భారీసైజు పడవలను ఫెర్రీలోనే తయారీ చేస్తున్నారు. రెవెన్యూ, జలవనరులు, అగ్నిమాపక శాఖ అధికారుల అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలం కబ్జా చేసి భారీస్థాయిలో పడవలు తయారు చేస్తున్నా.. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. డ్రెడ్జింగ్ యంత్రాలు కలిగిన ఒక్కొక్క పడవ సుమారు రూ.30నుంచి 35లక్షల వరకు వరకు ధర పలుకుతున్నాయి. తయారైన పడవలు వెంటనే పక్కనే ఉన్న కృష్ణానదిలోకి దించి ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టడం ఇక్కడ పరిపాటిగా మారింది.

రోజుకు రూ. 3.5లక్షల ఆదాయం..

కృష్ణానది నుంచి తవ్విన ఇసుకతో కూటమి నాయకులు రోజుకు సుమారు 500 ట్రాక్టర్లు రవాణా చేస్తున్నారు. ప్రతిరోజు 10 పెద్ద సైజు పడవలు, 15 చిన్న సైజుల పడవల ద్వారా రోజుకు సుమారు 500 ట్రాక్టర్ల రవాణా చేస్తున్నారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన ట్రాక్టర్లకు లోడింగ్ చార్జీలు ఒక్కొక్కటి రూ.700 చొప్పున వసూలు చేసి రోజుకు రూ.3.50 లక్షలు సంపాదిస్తున్నారు. ఈ లెక్కన నెలకు రూ.1.05 కోట్లు, ఏడాదికి రూ.12.60 కోట్లు అక్రమ సంపాదన వెనకేసుకునేందుకు కూటమి నేతలు ఇసుక దందాకు పాల్పడుతున్నారు. వీరి ఇసుక అక్రమ రవాణాకు స్థానిక ప్రజాప్రతినిధి అండదండలు ఉండటంతో మూడుపువ్వులు ఆరు కాయలుగా అక్రమ ఇసుక వ్యాపారం వర్ధిల్లుతోంది. అయితే ఇటీవల కూటమి నేతల్లో వచ్చిన ఆధిపత్య పోరుతో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. దీంతో అధికారులు దాడులు చేయగా కళ్లు చెదిరే నిజాలు వెలుగులోకి వచ్చాయి. రెండు రోజుల క్రితం ఇసుక రవాణాకు సిద్ధంగా ఉన్న 24 ట్రాక్టర్లు, లోడింగ్ చేస్తున్న 18 క్రేన్‌లు, ఇసుక ఒడ్డుకు తీసుకొచ్చిన 10 పడవలు సీజ్ చేశారు. ట్రాక్టర్ల డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు.



ఇబ్రహీంపట్నం ఫెర్రీలో మైనింగ్ అధికారులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

రబీ ధాన్యం సేకరణకు సన్నద్ధం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో రబీ (2024–25) సీజన్ ధాన్యం కొనుగోలుకు సన్నద్ధంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. గురువారం పౌర సరఫరాల కమిషనర్ సౌరభ్ గౌర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ డాక్టర్ మంజీర్ జిలానీ.. రబీ ధాన్యం సేకరణ సన్నద్ధతపై వర్క్‌షాప్‌తో పాటు ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌స్పెక్షన్ మాడ్యూల్, బఫర్ గోదాముల వినియోగం, కాగిత రహిత డిజిటల్ లావాదేవీలు తదితరాలపై వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు పౌర సరఫరాలు, వ్యవసాయం, సహకార, రవాణా తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. రబీ సీజన్ ధాన్యం సేకరణ సజావుగా జరిగేలా చేపట్టాల్సిన చర్యలపై ఎండీ మంజీర్ జిలానీ పలు సూచనలు చేశారు.

లక్ష్యాల మేరకు కొనుగోలు..

అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఖరీఫ్‌కు సంబంధించి 149 రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కే) ద్వారా 16,353 మంది రైతుల నుంచి దాదాపు రూ. 257 కోట్ల విలువైన 1,10,738 టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. ఇదే విధంగా రబీకి కూడా సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో ఈ-పంట నమోదు ఆధారంగా చూస్తే రబీలో 20,422 హెక్టార్లలో వరి వేశారని, 1,60,413 టన్నుల మేర ధాన్యం ఉత్పత్తి అయ్యే అవకాశముందని తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని లక్ష్యాల మేరకు మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. రబీ ధాన్యం సేకరణకు జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా ఆర్డీవోలు, పౌర సరఫరాల డీఎం, డీఎస్‌వో, డీఏవో తదితర అధికారులు సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేశామన్నారు. డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, పౌరసరఫరాల డీఎం ఎం.శ్రీనివాసు, డీఎస్‌వో ఎ.పాపారావు, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో భవన నిర్మాణాలు పూర్తి

కృష్ణా వర్సిటీ వీసీ రాంజీ

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కూన రాంజీ తెలిపారు. గురువారం ఆయన తన చాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో యూనివర్సిటీ ప్రాంగణంలో ఫార్మసీ కళాశాల, బాలికల వసతి గృహ భవన నిర్మాణాలను జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. వీటితో పాటు బాలుర వసతి గృహాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి విద్యార్థులు అన్ని కోర్సుల్లో చేరేలా చూస్తామన్నారు. బాలురు, బాలికల వసతి గృహాలు అందుబాటులో లేకపోవటం కారణంగానే వివిధ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు విముఖత వ్యక్తం చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో ఉమెన్స్ హాస్టల్‌తో ఫార్మసీ కళాశాలల భవనాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయంలో కాంట్రాక్టర్‌లు, ఏపీఈడబ్ల్యూఐడీసీ అధికారులతో సంప్రదింపులు జరిపినట్లు తెలిపారు. భవనాల నిర్మాణాలను పర్యవేక్షించేందుకు యూనివర్సిటీతో ఒప్పందం చేసుకున్న ఏపీఈడబ్ల్యూఐడీసీ అధికారులు సక్రమంగా పర్యవేక్షించకపోవటం, యూనివర్సిటీ అధికారులు సైతం పట్టించుకోని కారణంగా జాప్యం ఏర్పడిందన్నారు. అయితే ఇప్పుడు భవనాల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయని పక్షంలో 12 శాతం నగదును అపరాధ రుసుముగా వసూలు చేసేలా ఒప్పందం కుదుర్చుకుని మరీ నిర్మాణాలను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కృష్ణా యూనివర్సిటీకి రూ. 10.50 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఈ నిధులు జీతభత్యాలకు సరిపోతుందన్నారు. ఇంజినీరింగ్ కళాశాల, బాలుర హాస్టల్ భవన నిర్మాణాలను ప్రస్తుతానికి నిలిపివేస్తున్నామన్నారు. ఈ రెండు భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయాలని ప్రతిపాదనలు పంపుతామన్నారు.



మాట్లాడుతున్న వీసీ కూన రాంజీ, చిత్రంలో రెక్టార్ బసవేశ్వరరావు

త్వరలో స్నాతకోత్సవం..

త్వరలోనే కృష్ణా విశ్వవిద్యాలయం 8వ స్నాతకోత్సవాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వీసీ తెలిపారు. అందుకు గవర్నర్ అనుమతిని కోరతామన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి యూనివర్సిటీలో ఎం. ఫార్మసీ కోర్సును పునరుద్ధరిస్తామన్నారు. యూనివర్సిటీ అభివృద్ధి పనులకు బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరిని కలిసి ఎంపీ లాడ్స్ నుంచి నిధులను విడుదల చేయమని కోరామన్నారు. సమావేశంలో రెక్టార్ ఎంవీ బసవేశ్వరరావు, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఉష, విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

కవర్ కట్టు.. లాభాలు పట్టు

రూపాయి ఖర్చుతో ఫల'రాజసం'

- మామిడిలో కాయతొలుచు పురుగుకు కవర్లతో చెక్
- సబ్సిడీపై కవర్లు అందిస్తున్న ఉద్యానశాఖ
- ఈ నెల 25వ తేదీలోపు తీసుకోవాలంటున్న అధికారులు
- జిల్లాలో 9,925 ఎకరాల్లో మామిడి సాగు

అవనిగడ్డ: నాలుగేళ్ల నుంచి మామిడి రైతులను పీడిస్తున్న కాయతొలుచు పురుగు చెక్ పెట్టేందుకు కవర్లు అందుబాటులోకి వచ్చాయి. సబ్సిడీపై కవర్లు అందిస్తుండటంతో రైతులు వీటిని తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. మామిడికి కవర్లు తొడగటం వల్ల తెగుళ్లను నివారించడంతో పాటు కాయ నాణ్యత పెరిగి రెట్టింపు ధర వస్తుందని ఉద్యాన శాఖాధికారులు చెబుతున్నారు.

రూపాయికే కవర్..

కృష్ణాజిల్లాలో 9,925 ఎకరాల్లో మామిడి సాగు జరుగుతోంది. గత నాలుగేళ్ల నుంచి కాయతొలుచు పురుగు ఎక్కువగా ఆశించడం వల్ల కాయలు పుచ్చులు రావడంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. ఆర్థిక స్తోమత ఉన్న రైతులు సొంతంగా కవర్లు కొనుగోలు చేసి కాయలకు తొడగడం ద్వారా మంచి ఆదాయం తెచ్చుకుంటున్నారు. కోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీలో భాగంగా మ్యాంగో ఫ్రూట్ కేర్ యాక్టివిటీస్ ద్వారా ఈ ఏడాది రైతులకు సబ్సిడీపై కవర్లు అందిస్తున్నారు. ఒక్కో కవర్ ఖరీదు రెండు రూపాయలు ఉండగా, కవర్‌కు ఒక రూపాయి ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తోంది. హెక్టార్‌కు గరిష్టంగా పదివేల కవర్లు వరకూ ఇస్తున్నారు.

కాయతొలుచు పురుగుకు చెక్..

మామిడి కాయలకు కవర్లు తొడగటం వల్ల ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని ఉద్యాన వన శాఖాధికారులు తెలిపారు. మామిడికాయ నిమ్మకాయంత సైజు రాగానే కవర్లు తొడగాలని అధికారులు సూచిస్తున్నారు. కవర్లు తొడగటం వల్ల ప్రధానంగా మామిడిలో వచ్చే పలు రకాల తెగుళ్లతో పాటు కాయతొలుచు పురుగుకు చెక్ పెట్టొచ్చంటున్నారు. దీంతో పెట్టుబడి తగ్గడంతో పాటు కాయ నాణ్యత పెరిగి, రెట్టింపు ధరకు కాయలను అమ్ముకోవచ్చంటున్నారు. ఎకరాకు ఐదు టన్నులు మామిడి దిగుబడి వస్తుందనుకుంటే కవర్లు కడితే అరటన్ను ఎక్కువ వస్తుందని వివరిస్తున్నారు.



కవర్లు తొడిగిన మామిడి తోటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారి రమేష్



గత ఏడాది కవర్లు తొడగని తోటకు కాయతొలుచు పురుగు ఆశించడంతో పాడైన మామిడికాయలు

ఎకరాకు రూ.2లక్షల వరకూ లాభం..

కవర్లు కట్టని కాయలు గత ఏడాది టన్ను రూ.30వేలు ధర పలుకగా, కవర్లు కట్టినవి టన్ను రూ.70వేలు ధర పలికింది. కవర్లు కట్టడం వల్ల రైతుకు ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.2లక్షల వరకూ లాభం పొందవచ్చని అధికారులు చెబుతున్నారు. కవర్లు కావాలనుకున్న రైతులు ఈనెల 25వ తేదీ లోపు దగ్గరలోని వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖాధికారులను సంప్రదించాలని సంబంధిత అధికారులు సూచించారు.

ఆరువేల కవర్లు తీసుకున్నా..



14 ఎకరాల్లో మామిడి తోట ఉంది. కవర్లు తొడగడం వల్ల కాయలకు పుచ్చులు రావు. కవర్లు తొడిగిన కాయలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఈ సంవత్సరం దిగుబడి అంత ఆశాజనకంగా లేదు. ఉన్న కాయలను కాపాడుకోవాలనే ఉద్దేశంతో 6వేల కవర్లు తీసుకున్నా.

– లుక్కా శ్రీనివాసరావు, మామిడి రైతు అవనిగడ్డ

మంచి డిమాండ్..



నాలుగేళ్ల నుంచి మామిడి కాయలకు కాయతొలుచు పురుగు ఆశించడం వల్ల తీవ్రంగా నష్ట పోతున్నాం. వీటి నుంచి రక్షణకు కవర్లు తొడుగుతున్నాం. కవర్లు తొడిగిన కాయలకు మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉంది. రేటు కూడా రెట్టింపు వస్తోంది. సబ్సిడీపై అందించే కవర్లు నేను తీసుకుంటా.

– నిజాంపట్నం శ్రీహరిబాబు, కౌలు రైతు, ఎడ్లంక

కవర్లతో ఎన్నో ప్రయోజనాలు



మామిడికాయలకు కవర్లు తొడగడం వల్ల ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చు. పురుగు, తెగుళ్లను నివారించవచ్చు. అవనిగడ్డ నియోజకవర్గంలో 250 ఎకరాలకు కవర్లు అందుబాటులో ఉండగా.. ఇప్పటికి 50 ఎకరాల రైతులకు అందించాం. సబ్సిడీపై అందిస్తున్న కవర్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– ఎస్. రమేష్, ఉద్యాన శాఖాధికారి, అవనిగడ్డ

జీజీహెచ్‌కి మైక్రోస్కోప్‌లు వితరణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): రామవరప్పాడు సర్కిల్ యూనియన్ బ్యాంక్ బ్రాంచి వారు తమ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా విజయవాడ ప్రభుత్వాస్పత్రికి రూ. లక్ష విలువైన రెండు అత్యాధునిక మైక్రోస్కోప్‌లను అందజేశారు. రోగులకు నాణ్యమైన సేవలు అందించేందుకు ఉపయోగపడే బైనాక్యులర్ మైక్రోస్కోప్, ట్రినాక్యులర్ హెడెడ్ బైనాక్యులర్ మైక్రోస్కోప్ విత్ డిజిటల్ కెమెరా ఉన్న వాటిని ఆ బ్యాంక్ చీఫ్ మేనేజర్ సీహెచ్ నాగార్జున జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏ వెంకటేశ్వరరావుకు గురువారం అందజేశారు. వాటిని మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావుకు సూపరింటెండెంట్ అందజేశారు. కాగా పరికరాలు బ్యాంకు వారితో అందించేందుకు కృషి చేసిన ల్యాబ్ నోడల్ అధికారి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్. శుభాలక్ష్మి, గ్రేడ్–1 ల్యాబ్ టెక్నీషియన్ పి. నాగరాజులను సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు అభినందించారు. యూనియన్ బ్యాంకు డెప్యూటీ రీజనల్ హెడ్ బి. హరీష్, రీజనల్ హెడ్ ఎం. శ్రీధర్ డాక్టర్ ప్రసాద్‌బాబు, డాక్టర్ సరితా తదితరులు పాల్గొన్నారు.



జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు మైక్రోస్కోప్‌లు అందజేస్తున్న యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు

వాటర్ డిస్పెన్సరీ ప్రారంభం..

వేసవి నేపథ్యంలో సీరాలజీ ల్యాబ్‌లో పనిచేసే సిబ్బందికి ఉపయోగపడేలా గ్రేడ్–1 ల్యాబ్ టెక్నీషియన్ పి. నాగరాజు వాటర్ డిస్పెన్సరీని అందజేశారు. దానిని గురువారం సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు ప్రారంభించారు.

స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీకి అత్యాధునిక యంత్రం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ విద్యాధరపురంలోని ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీకి చెన్నైకు చెందిన జెడ్ఎఫ్ సీవీసీఎస్ ఇండియా లిమిటెడ్ సంస్థ బహూకరించిన ఎయిర్ బ్రేక్ డీబీఎస్ బీఎస్–6 వర్కింగ్ మోడల్ మెషిన్‌ను ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ ద్వారకాతిరుమలరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సుల బ్రేక్ సిస్టమ్‌పై డ్రైవర్లు, మెకానిక్‌లకు మెరుగైన అవగాహన కల్పించేందుకు ఈ మెషీన్ ఉపయోగపడుతుందని తెలిపారు. తద్వారా బస్ బ్రేక్ డౌన్లు, యాక్సిడెంట్లు తగ్గటానికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. విలువైన ఈ వర్కింగ్ మోడల్ మెషీన్‌పై శిక్షణ తీసుకుని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జెడ్ఎఫ్ సీవీసీఎస్ ఇండియా లిమిటెడ్ సంస్థ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎస్‌పీ సాంబశివరావు, ఏరియా మేనేజర్ ఎన్. సుమన్, ఏపీఎస్‌ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ సీహెచ్ రవివర్మ (అడ్మిన్), టి. చెంగల్‌రెడ్డి(ఇంజినీరింగ్), జి. విజయరత్నం (జోన్–2), జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజి ప్రిన్సిపాల్ బి. నీలిమ పాల్గొన్నారు.

రేపటి నుంచి సురభి పద్య నాటకోత్సవాలు

విజయవాడకల్చరల్: దక్షిణ మండల సాంస్కృతిక కేంద్రం(తంజావూరు), ఏపీ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వర రావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో 15తేదీ నుంచి 20వ తేదీ వరకు సురభి పద్యనాటకోత్సవాలు నిర్వహిస్తునట్లు సాంస్కృతికశాఖ సీఈవో ఆర్ మల్లికార్జున రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సురభి నాటక సంస్థలకు 140 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉందని, 40మంది కుటుంబసభ్యులే సంస్థ సభ్యులుగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నాటకాలను ప్రదర్శిస్తారని వివరించారు. నేటితరానికి సురభి సంస్థల విశేషాలను తెలియజేసేందుకు ఈ ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు.15వ తేదీ సాయంత్రం భక్తప్రహల్లద, 16న లవకుశ, 17న యాదాద్రి మహోత్సవం, 18న శ్రీకృష్ణలీలలు,19న జైపాతాళ భైరవి, 20వ తేదీన మాయాబజార్ నాటికల ప్రదర్శన ఉంటుందని వివరించారు. రోజూ సాయంత్రం ఏడుగంటలకు ప్రారంభమయ్యే నాటకాల ప్రదర్శనలకు ప్రవేశం ఉచితమని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో దక్షిణ మండల సాంస్కృతిక కేంద్రం నిర్వాహక సంఘ సభ్యులు మాధవి పురాణం పాల్గొంటారని వివరించారు.

ముప్పేట దాడితో అన్నదాత చిత్తు

- మినుము రైతులను వెంటాడుతున్న కష్టాలు
- మినుములో మూషికాల బెడద
- నిర్మూలనకు అదనపు పెట్టుబడులు
- సాగువ్యయం పెరగడంపై రైతుల ఆందోళన



మినుము చేలో ఎలుకల నిర్మూలనకు బుట్టలు పెడుతున్న కూలీ

కంకిపాడు: మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా మారింది మినుము రైతుల దుస్థితి. ఓవైపు దిగుబడులు ఆశాజనంగా లేకపోగా, మార్కెట్‌లో ఆశించిన ధర లేకపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో పైరుపై మూషికాలు దాడి చేస్తున్నాయి. పంట చేతి కొచ్చే తరుణంలో ఎడాపెడా పైరును ధ్వంసం చేస్తూ నష్టపరుస్తున్నాయి. దీంతో చేతికొచ్చిన పంటను కాపాడుకునేందుకు మినుము రైతులు అవస్థలుపడుతున్నారు.

2.84లక్షల ఎకరాల్లో సాగు..

కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది రబీ సీజన్‌లో 2,84,237 ఎకరాల్లో మినుము సాగు చేపట్టారు. ఎల్‌బీజీ, పీయు 31, టీబీజీ, ఇతర విత్తన రకాలను రైతులు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా మినుము తీత, నూర్పిడి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో భారీ వర్షాలు, వరదలకు పంటలు దెబ్బతిన్న రైతులు ముందస్తుగా రెండో పంట సాగుకు ఉపక్రమించారు. ఖరీఫ్ వరి కోతలు అనంతరం మినుము సాగు చేపట్టిన పొలాల్లో మాత్రం పైరు కాయ దశలో ఉంది. నెలాఖరుకి మినుముతీతలు చేపట్టే అవకాశం ఉంది.

కష్టం..నష్టం...

సాగు ఆరంభం నుంచీ ఈ సీజన్‌లో మినుము రైతులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మునుపెన్నడూ లేని విధంగా పంటకు పల్లాకు తెగులు ఆశించి తీవ్ర ప్రభావం చూపింది. మచ్చల పురుగు, తెగుళ్ల ఉధృతి కారణంగా పంట దిగుబడులు దెబ్బతిన్నాయి. ఎకరాకు రూ.25 వేలు వరకూ పెట్టుబడులు కాగా, తెగుళ్లు, పురుగుల నిర్మూలన చర్యలకు పైపాటు పనులకు మరో రూ.10 వేలు నుంచి రూ.15 వేలు వరకూ రైతులకు పెట్టుబడులు తప్పలేదు. ముందస్తుగా సాగు చేసిన పొలాల్లో మినుము తీత పనులు చేపడుతుండగా ఎకరాకు సరాసరిన 6 నుంచి 8 బస్తాలు వరకూ దిగుబడులు వస్తున్నాయి. అయితే మార్కెట్‌లో ధర మాత్రం ఆశాజనకంగా లేదు.

రూ.7400 మించని ధర..

మినుము మద్దతు ధర రూ 7400 ఉంటే అదే ధరకు కొనుగోలు చేస్తామని వ్యాపారులు చెబుతున్నారు. గతేడాది రూ9800 వరకూ ధర పలకడంతో, అదే ధర దక్కుతుందని ఆశించిన రైతులకు తీవ్ర నిరాశ తప్పడం లేదు. మరో వైపు కాయ దశలో ఉన్న మినుము పంటపై ఎలుకలు దాడి చేస్తున్నాయి. విచక్షణారహితంగా పంటను దెబ్బతీస్తున్నాయి. కాయ, గింజ గట్టి పడే దశలో ఎలుకలు దాడిచేసి పంటకు నష్టం చేకూరుస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలుకలు పట్టేందుకు ఒక్కో సంచార జాతులవారు ఒక్కో ఎలుకకు రూ.30 వరకూ వసూలు చేస్తున్నారు. పంట దెబ్బతినడంతోపాటు, యాజమాన్యానికి అదనపు పెట్టుబడి వెచ్చించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. మూషికాల బెడద నుంచి పంటను కాపాడుకునే పనిలో అన్నదాతలు నిమగ్నమవుతున్నారు.

సాగంతా నిరాశాజనకం..



గతంతో పోలిస్తే మినుములో ఈ ఏడాది తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంది. దిగుబడులు పూర్తిగా తగ్గాయి. నేను 20ఎకరాలు కౌలు చేస్తున్నా. ఎకరాకు 6 నుంచి 7 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చేలా ఉంది. పెట్టుబడి మాత్రం ఎకరాకు రూ.40 వేలు వరకూ అయ్యింది. దీనికితోడు ఎలుకల బెడద ఎక్కువగా ఉంది. పక్కనే ఉన్న దాళ్వా వరి పొలాల్లో ఉన్న ఎలుకలు మినుము పైరును నష్టపరుస్తున్నాయి. దీంతో దిగుబడులు మరింత తగ్గే అవకాశం ఉంది.

మసిముక్కు సాంబశివరావు,
కౌలురైతు, దావులూరు

క్లెయిమ్‌ను వడ్డీతో సహా చెల్లించాలంటూ తీర్పు

చిలకలపూడి(మచిలీపట్నం): ఖాతాదారునికి వడ్డీతో సహా క్లెయిమ్ మొత్తాన్ని చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీరాయల గురువారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే...విజయవాడకు చెందిన బి.వెంకటసింహాచలం ఆంధ్రాబ్యాంకు కానూరు బ్రాంచ్‌లో సేవింగ్స్ ఖాతా ఉంది. బ్రాంచ్ మేనేజర్ సలహా మేరకు ఈ ఖాతా ద్వారా ఏబీ ఆరోగ్యధాన్ పాలసీని 2015 ఆగస్టు 20వ తేదీన యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలో తీసుకున్నారు. 2018 జూన్ 8వ తేదీ వరకు పాలసీ ప్రీమియంను సకాలంలో చెల్లించారు. ఫిబ్రవరి 2018లో అనారోగ్య కారణంగా లేపరోస్కోపీ శస్త్రచికిత్స నిమిత్తం రూ.1,64,435 ఖర్చు చేశారు.ఈ క్రమంలో క్లెయిమ్ కోసం ఇన్సూరెన్స్ కంపెనీని సంప్రదించగా ముందుగానే అనారోగ్యం ఉందని తెలియజేయలేదంటూ క్లెయిమ్‌ను తిరస్కరించారు. దీంతో బాధితుడు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. పూర్వాపరాలను పరిశీలించిన అనంతరం కమిషన్ సభ్యులు 2018 జూన్ 19వ తేదీ నుంచి 9శాతం వడ్డీతో రూ.1,64,435 చెల్లించాలని, మానసిక వేదన కలిగించినందుకు రూ.25వేలు, ఖర్చుల నిమిత్తం రూ.5వేలు చెల్లించాలని సదరు ఇన్సూరెన్స్ కంపెనీని ఆదేశిస్తూ తీర్పు చెప్పారు. ఈ మొత్తాన్ని 30 రోజుల్లోగా ఖాతాదారుడికి అందజేయాలని ఆ తీర్పులో ఆదేశించారు.

వెబ్‌సైట్‌లో డీఎస్సీ ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల జాబితా

చిలకలపూడి(మచిలీపట్నం): సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు సాంఘిక సంక్షేమశాఖ డీడీ షేక్ షాహెద్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాలో ఉన్న అభ్యర్థులు మార్చి 15వ తేదీలోగా ఎంప్యానల్డ్ కోచింగ్ సంస్థలను ప్రాధాన్యతలను నమోదు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు వారి ప్రాధాన్యత ప్రకారం ఉచిత డీఎస్సీ ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు వివరించారు.

సప్త జ్యోతిర్లింగ దర్శన యాత్ర

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): పవిత్ర పుణ్యక్షేత్రాలైన సప్త జ్యోతిర్లింగాలను దర్శించుకునేందుకు భక్తులు, యాత్రికుల కోసం ఐఆర్‌సీటీసీ (ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్) విజయవాడ నుంచి భారత్ గౌరవ్ పర్యాటక రైలును నడపనున్నట్లు ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ ఎం.రాజా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల లోని యాత్రికులు ఏప్రిల్ 8 నుంచి 19వ తేదీ వరకు దేశంలోని ఏడు జ్యోతిర్లింగాలను దర్శించుకునేందుకు ఈ రైలును నడుపుతున్నట్లు వివరించారు. ఈరైలు విజయవాడ నుంచి ఖమ్మం, కాజీపేట, సికింద్రాబాద్ మీదుగా ప్రయాణిస్తుందన్నారు. 11రాత్రులు, 12రోజులపాటు సాగే ఈ ప్రయాణంలో ఉజ్జయినిలోని మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, ద్వారకాలోని నాగేశ్వర్, సోమనాథ్‌లోని సోమనాథ్ జ్యోతిర్లింగం, పూణేలోని భీమశంకర, నాసిక్‌లోని త్రయంబకేశ్వర్, ఔరంగాబాద్‌లోని గ్రిష్ణేశ్వర జ్యోతిర్లింగాల దర్శనం ఉంటుంది. ఈ యాత్రలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజన సదుపాయంతోపాటుగా పర్యటక ప్రదేశాలను దర్శించుకునేందుకు రోడ్డుమార్గంలో రవాణా సదుపాయం, హోటల్స్‌లో బస ఏర్పాట్లు ఉంటాయన్నారు. ప్రతి కోచ్‌కు ఎస్కార్ట్, టూర్ గైడ్, టూర్ మేనేజర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు.

ప్యాకేజీ వివరాలు...

మూడు కేటగిరీలుగా ఉన్న ప్యాకేజీలో ఎకానమి(స్లీపర్ క్లాస్)లో పెద్దలకు ఒక్కొక్కరికి రూ.20,890, పిల్లలకు రూ.19,555, స్టాండర్డ్ (3ఏసీ) పెద్దలకు రూ.33,735, పిల్లలకు రూ.32,160, కంఫర్ట్ (2ఏసీ) పెద్దలకు రూ.44,375, పిల్లలకు రూ.42,485గా ధర నిర్ణయించారు. అసక్తికలిగిన వారు విజయవాడలోని ఐఆర్‌సీటీసీ కార్యాలయం లేదా సెల్‌నంబర్లు 9281495848, 92810 30714లో సంప్రదించాలన్నారు. ఐఆర్‌సీటీసీ వెబ్ సైట్ ద్వారా కూడా టిక్కెట్లు బుక్‌చేసుకోవచ్చని వివరించారు.

తృటిలో తప్పిన ప్రాణాపాయం



ప్రమాదంలో దెబ్బతిన్న కారు


కృత్తివెన్ను: అతివేగంగా వచ్చిన భారీ వాహనం కారును ఢీ కొట్టడంతో కారు ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, భారీ వాహనానికి మధ్యన ఇరుక్కుపోయింది. ఈ సమయంలో కారులోని ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో కారులోని ప్రయాణికులకు ప్రాణాపాయం తప్పింది. జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన ఈ ఘటన స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. స్థానికుల కథనం మేరకు.. నరసాపురం నుంచి మచిలీపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రయాణికులను దించేందుకు బస్‌స్టాప్ వద్ద ఆగింది ఈ సమయంలో దాని వెనుక వస్తున్న కారును అదే సమయంలో దాని వెనుక వచ్చిన మరో భారీ వాహనం ఢీ కొట్టింది. దీంతో కారు బస్సు, భారీ వాహనానికి మధ్య ఇరుక్కుపోయింది. ఈ ఘటనలో ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే కారులోని వ్యక్తులను బయటకు దించి వైద్యచికిత్స కోసం భీమవరం తరలించారు. ఘటనలో కారు ముందు, వెనుక భాగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి.

బోరుగడ్డ అనిల్‌కు 14 రోజులు రిమాండ్

– రాజమండ్రి జైలుకు తరలింపు

చిలకలపూడి(మచిలీపట్నం): బోరుగడ్డ అనిల్‌కు 14 రోజులు రిమాండ్ విధిస్తూ రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి గురువారం రాత్రి తీర్పు వెల్లడించారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం మండల పరిధిలోని బెరాక వసతి గృహంలో మైనర్ బాలిక చనిపోయిన కేసులో బోరుగడ్డ అనిల్ సోషల్ మీడియా ద్వారా పోలీసు అధికారులపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనిపై నమోదైన కేసుకు సంబంధించి ఇటీవల నాన్ బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేశారు. దీంతో ఆయనను పోలీసులు అనంతపురంలో అరెస్ట్ చేసి మచిలీపట్నం తీసుకువచ్చి న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. పూర్వాపరాలను విచారించిన అనంతరం అనిల్‌కు న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. దీంతో పోలీసులు అనిల్‌ను రాజమండ్రి జైలుకు తరలించారు.

నదిలో పడి వ్యక్తి మృతి



మృతుడు సురేష్(ఫైల్)

కంచికచర్ల : మొక్కజొన్న విత్తనాలను కాటా వేసేందుకు వెళ్లిన ఓవ్యక్తి బహిర్భూమికని వెళ్లి కృష్ణానదిలో ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృతిచెందిన సంఘటన గురువారం కంచికచర్ల మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాజు కథనం మేరకు వీరులపాడు మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన పడిగెల సురేష్‌బాబు(43) తోటికూలీలతో కలసి మొక్కజొన్న విత్తనాలను కాటా వేసేందుకు బుధవారం మండలంలోని కొత్తపేట గ్రామానికి వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో బహిర్భూమికి కృష్ణానది వైపు వెళ్లి, ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడి గల్లంతయ్యాడు. అయితే సురేష్ ఇంటికి వెళ్లాడనుకుని తోటి కూలీలు వారి గ్రామాలకు వెళ్లారు. సురేష్ ఇంటికి చేరకపోవడంతో రాత్రంతా అతనికోసం వెతికారు. కాని అతని జాడ తేలియలేదు. ఈక్రమంలో గురువారం ఉదయం కుటుంబసభ్యులు, తోటి కూలీలు తిరిగి కొత్తపేట గ్రామానికి వెళ్లి కృష్ణానదిలో వెతుకగా, సురేష్ మృతదేహం నదిలో తేలియాడుతున్నట్లు గుర్తించి వెంటనే పోలీసులకు తెలియజేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడు సురేష్‌కు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె ప్రస్తుతం ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తోంది. సురేష్ మృతితో ఆకుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

వర్డ్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష, ఎస్‌సీఈఆర్‌టీ, విభా, లీప్ ఫార్వర్డ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో భవానీపురంలోని బెరంపార్క్‌లో గురువారం వర్డ్ పవర్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పెల్‌బీ తరహాలో దేశంలోని ప్రాంతీయ భాషా పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేకంగా రూపొందించిన ఏకైక ఆంగ్ల పోటీ ఇది అని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల బోధనను సులభతరం చేయడమే ఈ కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఈ పోటీని ఏడు జిల్లాల్లో ఐదుస్థాయిల్లో నిర్వహించామని తెలిపారు. విజేతలు ఏప్రిల్ నెలలో ముంబైలో జరిగే ఇంటర్ స్టేట్ గ్రాండ్ ఫైనల్‌లో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో విభా సౌత్ ఇండియా మేనేజర్ టి.వీరనారాయణ, లీప్ ఫార్వర్డ్ టీమ్ ప్రతినిధి ప్రణీల్‌నాయక్, శ్వేత, విజయకుమార్, సమగ్ర శిక్ష నుంచి జి.అపర్ణ, డాక్టర్ శారద, శైలా కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఆశోక్ లేల్యాండ్ ప్లాంట్ ప్రారంభానికి సన్నాహాలు



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం మల్లవల్లిలోని ఏపీఐఐసీ పారిశ్రామికవాడలో ఏర్పాటు చేసిన ఆశోక్ లేల్యాండ్ బస్ బాడీ బిల్డింగ్ తయారీ పరిశ్రమను ఈనెల 19వ తేదీన రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఫ్యాక్టరీ వర్గాలు తెలిపాయి. సుమారు 75 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన బస్‌బాడీ బిల్డింగ్ తయారీ యూనిట్‌లో ఇటీవలే పెండింగ్ పనులను పూర్తి చేయడంతోపాటుగా ట్రయన్ రన్ నిర్వహించారు. ఈ యూనిట్‌లో అత్యాధునిక సాంకేతికత, బీఎస్-6 నాణ్యాత ప్రమాణాలతో బస్సులను తయారు చేయనున్నారు. ఈ ప్లాంట్ ఏటా 4800 బస్సుల ఉత్పత్తి సామర్థ్యంతో 5000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించనుందని ఫ్యాక్టరీ వర్గాలు తెలిపాయి.

రూ.49.18 కోట్లతో రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దక్షిణ మధ్య రైల్వేలోని గూడూరు స్టేషన్ పునరాభివృద్ధి పనులకు రైల్వేమంత్రిత్వశాఖ రూ.49.18కోట్లు నిధులు మంజూరు చేసినట్లు డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ తెలిపారు. దీంతో గూడూరు స్టేషన్‌లో ప్రపంచస్థాయి అత్యాధునిక మౌలిక సదుపాయాలతో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే తిరుపతి, పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాల ప్రాంతీయ వృద్ధి జరుగుతుందన్నారు. ఈ ప్రాజెక్ట్‌లో స్థానిక సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా గ్రౌండ్ ప్లస్ టూ అంతస్తులతో స్టేషన్ భవన నిర్మాణం, ఒకటి నుంచి ఐదు వరకు ఉన్న ప్లాట్‌ఫాంల పొడవు పెంపు, తూర్పు నుంచి పశ్చిమ ప్రవేశ ద్వారం మధ్య 12 మీటర్ల వెడల్పుగల రూఫ్ ప్లాజా, సర్కులేటింగ్ ప్రాంతం అభివృద్ధి తదితర పనులు చేపట్టనున్నట్లు వివరించారు. పనులు పూర్తయితే ఈ స్టేషన్ డివిజన్‌లోనే ఓ ల్యాండ్ మార్కుగా ఉంటుందన్నారు. అమృత్ భారత్ పథకంలో గూడూరు స్టేషన్ కూడా చేరడంలో డివిజన్‌లో మొత్తం 21 రైల్వేస్టేషన్లను రూ.567.41కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు డీఆర్ఎం తెలిపారు.

వైఎస్ జగన్‌ను కలిసిన ఇన్‌చార్జ్‌లు



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు పేర్ని నాని, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, నాయకులు

చిలకలపూడి(మచిలీపట్నం): తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కృష్ణాజిల్లాలోని నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, నాయకులు కలిశారు. ఆపార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీమంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు కైలే అనిల్‌కుమార్, ఉప్పాల రమేష్ (రాము), దేవభక్తుని చక్రవర్తి, సింహాద్రి రమేష్, పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)లు జగన్‌ను కలిశారు. వీరితోపాటు పార్టీ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, గాడెల్లి డేవిడ్‌శామ్యూల్, సింహాద్రి వికాస్ ఉన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ ప్రకటన

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణాజిల్లా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా కమిటీని నియమిస్తూ గురువారం ఆపార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా జొన్నలగడ్డ రామ్మోహన్‌రెడ్డి (పామర్రు), మండలి హనుమంతరావు (గుడివాడ), బొర్రా విఠల్‌రావు (మచిలీపట్నం), గోన మదన్ (పెనమలూరు), పిన్నెంటి మహేష్ (పెడన), పడమట వీరకుమార్ (అవనిగడ్డ)లను నియమించారు. ప్రధానకార్యదర్శులుగా కందుల నాగరాజు (గుడివాడ), శీలం శ్రీరాములు (పెనమలూరు), కౌంతి ఫరీద్ (మచిలీపట్నం), మేకల సుధాకర్ బాబు (సుబ్బన్న) (మచిలీపట్నం), మోర్ల రామచంద్రరావు (పామర్రు), గౌరిపర్తి రవికుమార్ (పెడన), మోపిదేవి ద్వారకనాథ్ (అవనిగడ్డ), కోశాధికారిగా బందెల నోబుల్‌థామస్ (మచిలీపట్నం), ఆర్గనైజేషనల్ సెక్రటరీలుగా కోటప్రోలు నాగు (గుడివాడ), ఈదా రాజేష్ (పెనమలూరు), ఎండీ ఫజులుల్లా (పెనమలూరు), జువ్వా నాగరాజు (మచిలీపట్నం), జోగి చిరంజీవి (మచిలీపట్నం), మట్టా నాగబాబు (పెడన), బందారు చంద్రశేఖర్ (పెడన), బడే సూర్యనారాయణ (అవనిగడ్డ), తోట సాయిబాబు (అవనిగడ్డ), కారే జోసఫ్ (గుడివాడ), నాగబోయిన సునీల్ (పామర్రు), తిరుమలశెట్టి బోసుబాబు (పామర్రు), అబ్దుల్ ఖాదర్ జిలానీ (పెడన) నియమితులయ్యారు. యాక్టివిటీ సెక్రటరీలుగా ఉప్పాల వీరబాబు (పెనమలూరు), పాలడుగు శివజ్యోతి (పెనమలూరు), గూడవల్లి నాగరాజు (మచిలీపట్నం), గణేశన రమేష్‌బాబు (మచిలీపట్నం), పెంది వెంకన్నబాబు (పెడన), లంకా సుబ్రహ్మణ్యం (పెడన), మోర్ల శ్రీనివాసరావు (అవనిగడ్డ), లింగం జగదీష్ చంద్రకుమార్ (అవనిగడ్డ), కోర్నిపాటి గణపతి (గుడివాడ), వెంపటి సాల్మన్ (గుడివాడ), ముత్యాల నాగరాజు (పామర్రు), దేవభక్తుని రాము (పామర్రు)లను నియమించారు. అధికార ప్రతినిధులుగా నట్టా వెంకటేశ్వరరావు (పెనమలూరు), షేక్ ముస్తఫా (అచ్చెబా) (మచిలీపట్నం), గరికిపాటి రామానాయుడు (పెడన), గుర్రం బసవయ్య (అవనిగడ్డ), మీర్ అస్గర్ అలీ (మచిలీపట్నం), ఎంవీ నారాయణరెడ్డి (గుడివాడ), చీకుర్తి వరప్రసాద్ (పామర్రు)లను నియమించారు.

శాస్త్రవేత్తలు రైతులకు మరింత చేరువ కావాలి



సమావేశంలో గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరుతున్న రైతు లీలామోహనరావు

గరికపాడు(జగ్గయ్యపేట): శాస్త్రవేత్తలు తమ పరిశోధలన ద్వారా రైతులకు మరింత చేరువ కావాలని ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం విస్తరణ విభాగం సంచాలకుడు డాక్టర్ జి.శివన్నారాయణ సూచించారు. గ్రామంలోని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి, కేవీకే సంయుక్త ఆధ్వర్యంలో గురువారం 25వ శాస్త్రీయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ప్రతి సమస్యను శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. లాభసాటి, అధిక దిగుబడి వచ్చే విత్తనోత్పత్తి, కొత్తరకం వంగడాలపై శాస్త్రవేత్తలు దృష్టి సారించాలన్నారు. వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, వర్మికంపోస్ట్ వినియోగం, భూసార పెంపుతోపాటు రైతులకు పంటల మార్పిడిపై కూడా ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. దీర్ఘకాలంగా ఒకే పంటను సాగుచేస్తే జరిగే అనర్థాలను రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా రైతుశిక్షణ తరగతులకు గతంలో వచ్చేవారు మినహా కొత్త రైతులు ఎందుకు రావడం లేదని శాస్త్రవేత్తలను ప్రశ్నించారు. కేవీకేలో జరిగే ప్రతి కార్యక్రమం గురించి రైతులకు సమాచారం ఉండాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. వరి విత్తనాలను ఈప్రాంత రైతులకే అందించాలని, పక్క రాష్ట్రాలకు అమ్మకూడదని ఆదేశించారు. అనంతరం 2025 పశుపాలక్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సహ పరిశోధనా సంచాలకుడు డాక్టర్ ఏఎం రత్నం, జిల్లా పశువైద్యాధికారి హనుమంతరావు, జిల్లా ఉద్యాన శాఖాధికారి బాలాజీ, ఆత్మ పీడీ నరసింహ, పశువైద్య ఏడీఏ భవానీ ప్రసాద్, కేవీకె కోఆర్డినేటర్ అచ్యుతరాజు, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల పరిశోధనా శాస్త్రవేత్త కృష్ణంరాజు, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, శాస్త్రవేత్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరలు లేవంటూ రైతు ఆవేదన..

సలహా మండలి సమావేశంలో చిల్లకల్లు గ్రామానికి చెందిన రైతు లీలామోహన్ మాట్లాడుతూ ఏ పంటకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో వ్యవసాయం చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటలకు గిట్టుబాటు ధరల కల్పనపై దృష్టి సారిస్తేనే పంటలు సాగు చేస్తామంటూ సమస్యను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై శివన్నారాయణ మాట్లాడుతూ గిట్టుబాటు ధరలపై ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు.

వంశీపై పీటీ వారెంట్

గన్నవరం: విజయవాడ జిల్లా జైలులో ఉన్న మాజీఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌పై ఆత్కూరు, గన్నవరం పోలీసులు గురువారం వేర్వేరుగా స్థానిక కోర్టులో పీటీ వారెంట్ దాఖలు చేశారు. వివరాల్లోకి వెళితే..గన్నవరం టీడీపీఆఫీస్‌పై దాడి కేసులో ఫిర్యాదుదారుడైన సత్యవర్ధన్ కిడ్నాప్ చేశారంటూ పోలీసులు నమోదు చేసిన కేసులో వంశీమోహన్ అరెస్ట్ అయి నెలరోజులుగా విజయవాడ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ప్రస్తుతం ఆయన బెయిల్ పిటిషన్‌పై విజయవాడ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులో వాదనలు కొనసాగుతున్నాయి. ఈనేపథ్యంలో ఆత్కూరు పీఎస్ పరిధిలో నమోదైన స్థలవివాదం కేసు, గన్నవరం పీఎస్‌లో నమోదైన పానకాలు చెరువు తవ్వకాలపై కేసుల్లో వంశీమోహన్‌పై స్థానిక 8వ అదనపు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో పీటీ వారెంట్‌ను పోలీసులు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ఇరువర్గాల న్యాయవాదుల వాదనలను విన్న న్యాయాధికారిణి తీర్పును త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు.